

నేడు స్పందన యధాతథం

ప్రజాశక్తి - ఏలూరు

ఉంగుటూరు మండలం నారాయణపురం - గణపవరం రోడ్డులోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో ఈనెల 17వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి జిల్లాస్థాయి స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జెసి, జిల్లా అధికారులు అందరూ హాజరై అర్జీలను స్వీకరిస్తారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో, జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' ఎప్పటిలాగానే కొనసాగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

జల క(ళ)లే..!



మెట్ట ప్రాంత రైతులకు ప్రభుత్వం ఝలక్
అక్కరకు రాని వైఎస్ఆర్ జలకళ
బోర్లు వేయరు.. వేసిన బోర్లకు డబ్బులివ్వరు
పెండింగులో రూ.30 కోట్లు బకాయిలు
నిర్ధేశిత లక్ష్యానికి.. కార్యాచరణకు పొంతన కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైఎస్ఆర్ జలకళ పథకం రైతులకు అక్కరకు రావడం లేదు. ప్రభుత్వం ప్రకటనలకు,, క్షేత్రస్థాయిలో కార్యాచరణకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. ఇటీవల జరిగిన డిఆర్సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశంలో ఎంఎల్ఎలు అంతా జలకళ పథకం అమలు తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేయడమే దీనికి నిదర్శనం. ఈ పథకంలో బోర్లు వేసే కాంట్రాక్టర్లు ఎవరో కూడా ఎంఎల్ఎలకే తెలియని పరిస్థితి ఉంది. 2020 సెప్టెంబర్లో వైఎస్ఆర్ జలకళ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు మూడేళ్ళు కావొస్తోంది. ఇప్పటి వరకూ జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యానికి.. జరిగిన పనికి ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. జిల్లాలో మొత్తం 3,705 బోర్లు జలకళ పథకం ద్వారా వేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 1200 బోర్లు కూడా పూర్తి కాలేదు. పూర్తయినట్లు పేర్కొంటున్న బోర్లకు విద్యుత్ సర్వీసులు సైతం ఇవ్వని దుస్థితి నెలకొంది. జలకళలో వేసిన బోర్లు వినియోగంలోకి వచ్చిన పరిస్థితి లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండున్నర ఎకరాల నుంచి ఐదెకరాల వరకూ ఉన్న ప్రతి రైతూ జలకళలో బోరు వేసుకునేందుకు అర్హులే. బోర్లు వేసుకునేందుకు దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా బోర్లు మాత్రం వేయడం లేదు. ఈ పథకంలో బోర్లు వేసే కాంట్రాక్టర్లు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్లపై అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. ఇప్పటి వరకూ జలకళలో రూ.40 కోట్లు పని జరిగితే రూ.30 కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి జలకళ అమలు తీరు ఏమిటో ఇట్టే అర్థమవుతోంది. తొలుత జలకళలో బోర్లు వేసుకునే రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని చావుకబురు చల్లగా చెప్పింది. బోరు వేసుకునే క్రమంలో అత్యధిక ఖర్చు విద్యుత్ సర్వీసుకే అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఊరించి... ఉసూరుమన్పించారు..!

జలకళ పథకం కింద రైతులకు ఉచిత బోర్లు వేస్తున్నట్లు ప్రభుత్వం చేసిన ఆర్భాటం అంతాఇంతా కాదు. బోర్లు వేసుకునే స్థోమత లేని రైతులంతా జలకళ పథకం ద్వారా బోరు వేసుకోవచ్చునని ఎంతో ఆశపడ్డారు. ఈ పథకాన్ని మొత్తం నీరుగార్చే యడంతో రైతులు ఉసూరుమంటున్న పరిస్థితి నెలకొంది. ఉచితంగా బోర్లు వేస్తామని చెప్పి ప్రభుత్వం వేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన డిఆర్సి సమావేశంలో ఎంఎల్ఎలు మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి, బిసిలకైనా జలకళ పథకంలో వేసే బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా తీర్మానం చేయాలం టూ అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే జలకళ పథకాన్ని ప్రభుత్వం నీరుగార్చడంపై రైతుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కాంట్రాక్టర్లపై డ్వామా అధికారులకు సైతం కనీస అజమాయిషీ లేకుండా పోయిందనే విమర్శలు రైతుల నుంచి విన్పిస్తున్నాయి. దెందులూరు, చింతలపూడి వంటి నియోజ కవర్గాల్లో బోర్లు వేసుకునేందుకు ఎంతోమంది రైతులు ఎదురు చూస్తున్నట్లు ప్రజాప్రతినిధులే చెబుతున్నారు. జలకళ పథకం అమలు ఏవిధంగా ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జలకళ పథకంలో బోర్లు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే బోర్లు వేసేలా చర్యలు తీసుకుంటే ఎంతోమంది రైతులకు మేలు జరుగుతుంది.

కరోనాను సమర్ధవంతంగా ఎదుర్కొంటాం

పెరుగుతున్న కేసుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఈనెల 15వ తేదీ ఒక్కరోజే ఎనిమిది కేసులు
సిబ్బందిని, ఆసుపత్రులను సిద్ధం చేశాం
అందుబాటులో సరిపడా ఆక్సిజన్ సిలిండర్లు
డిఎంహెచ్ఒ డి.ఆశ



ముఖాముఖి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

'దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ఈనెల 15వ తేదీ ఒక్కరోజే ఎనిమిది పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. అవసరమైన సిబ్బందిని సిద్ధం చేయడంతో పాటు, కోవిడ్ను ఎదుర్కోవడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దయాల ఆశ తెలిపారు. కరోనా నేపథ్యంలో శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలు, కరోనాపై ప్రజలను చైతన్య పరచడానికి చేపడుతున్న కార్యక్రమాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న : కరోనా నియంత్రణకు వైద్యశాఖపరంగా తీసుకుంటున్న చర్యలేంటి?

జిల్లాలో ఈనెల 15వ తేదీ ఒక్కరోజే ఎనిమిది పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లాలో ఆస్పత్రుల సమాచారాన్ని వైద్యశాఖ కోరింది. రాండం సర్వే నిర్వహించాం. దగ్గు, జలుబు ఉన్న వారికి రాపిడ్ టెస్టులు చేస్తున్నాం. పాజిటివ్ వచ్చిన వారికి ఏలూరు, జంగారెడ్డిగూడెం ల్యాబ్లలో ఆర్టిపిసిఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : ఏయే ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి?

విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో, ప్రధానంగా తెలంగాణా ప్రాంతాల నుండి వచ్చిన వారిలో ఎక్కువగా కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ప్రజలు కొత్తవక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అలాగే ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలి.

ప్రశ్న : కోవిడ్ దృష్ట్యా ఎన్ని ఆసుపత్రులను సిద్ధం చేశారు?

కోవిడ్ను ఎదుర్కొనేందుకు ఏపి పరిధిలోని 18 ఆసుపత్రులు కోవిడ్ చికిత్స కోసం సిద్ధం చేశాం. ఏలూరులోని మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి ఏరియా ఆసుపత్రులు, ఆరు సామాజిక ఆసుపత్రులను సిద్ధం చేశాము. జిల్లాలోని 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాం. గతంలో37 ప్రయివేటు ఆసుపత్రులను ఏర్పాటు చేశాం. ఇప్పుడు వాటి విషయమై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం. రెండు, మూడు దశల కోవిడ్ అనుభవాల దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధంగా ఉంచారా?

ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, డి.టైప్ సిలిండర్లు సిద్ధంగా ఉంచాము. యాంటీ వైరల్ డ్రగ్స్ ఆసుపత్రుల్లో ఉన్నాయి. పాజిటివ్ వచ్చిన వారికి ఐసోలేషన్ కిట్లు అందిస్తున్నాము. 60 పిహెచ్సిల్లో ఐవి 50 చొప్పున ఉన్నాయి.

ప్రశ్న : ప్రస్తుత కరోనా నేపథ్యంలో కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గతంలో నియోజకవర్గంలో ట్రైబల్ సెల్ కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేశాం. గ్రామాల్లోనూ ట్రైబల్ సెల్ కోవిడ్ కేర్ సెంటర్లు సిద్ధం చేశాం. తక్కువ జలుబు, తక్కువ లక్షణాలున్నవారికి గ్రామాల్లోనే చికిత్స అందించారు. ఐసికల్ 500 ఐసియు బెడ్స్, 2100 ఆక్సిజన్ బెడ్స్ మొత్తంగా 3,600 బెడ్లు సిద్ధంగా ఉంచారు. ఈసారి అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే ప్రభుత్వ ఆదేశాలు అనుగుణంగా తక్షణ ఏర్పాట్లు చేస్తాం.

ప్రశ్న : వ్యాక్సినేషన్ ఎంతవరకు వచ్చింది?

15 నుంచి 18 ఏళ్లలోపు వారికి నూరు శాతం వ్యాక్సినేషన్ పూర్తయింది. మూడోవేవ్ ముందు, తర్వాత ప్రికాషన్ డోస్ పెద్దలకు వేశాం.

ప్రశ్న : థర్డ్ వేవ్ సిబ్బందిని తీసుకుంటున్నారా?

గత కోవిడ్ సమయంలో పనిచేసిన 50 మంది సిబ్బందిని తీసుకున్నాం. తర్వాత అనేకమార్లు రిక్రూట్మెంట్ ద్వారా అనేక మందిని తీసుకున్నాం. గతంలో కోవిడ్లో పనిచేసిన వారు ఉద్యోగులుగా చేరారు. దీంతో సిబ్బంది కొరత లేనట్లే.

ప్రశ్న : సీజనల్ వ్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జిల్లాలో మూడు వారాలుగా ఫీవర్ సర్వే జరుగుతోంది. వాలంటీర్, ఎఎన్ఎం ద్వారా ఈ సర్వే సాగుతుంది. త్వరలో ముగియనుంది. జిల్లాలో హెచ్3, ఎన్2 ఇన్ ఫ్లూ యెంజా వైరస్ వల్ల జ్వరం, జలుబు వంటివి సంభవిస్తున్నాయి. సిట్రిజిన్, పారాసిట్మాల్ వంటివి వేసుకోవాలని సూచిస్తున్నాం. ఈ మందులు పిహెచ్సిల్లో అందుబాటులో ఉంచాము. మలేరియా, టైఫాయిడ్ వంటివి ఉన్నాయి.

ప్రశ్న : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు ఎలా ఉంది..?

జిల్లాలో ఫామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సక్రమంగా నడుస్తోంది. 60 పిహెచ్సిలకు 120 మంది డాక్టర్లు ఉన్నారు. 15 రోజులు క్షేత్రస్థాయిలో, 15 రోజులు మంచానపడ్డవారిని సందర్శిస్తారు. పిహెచ్సిలకు వచ్చే రోగులను ఒక వైద్యుడు పరిశీలిస్తారు. 104 వాహనాలు 28 మండలాలకు 28 ఉన్నాయి. కొత్తగా 16 ఇచ్చారు. వాహనంలో మెడికల్ ఆఫీసర్ వెళ్లి వైద్యం అందించి మందులు ఇస్తారు.



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజలకు అండగా ఉంటాం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు అండగా ఉంటామని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు(డిఎన్ఆర్) స్పష్టం చేశారు. మండలంలోని ఉనికిలి గ్రామంలో 125వ రోజు ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఉదయం పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా ముందుగుర్తుకు వచ్చేది చింతపల్లి అంకినీడు అని అన్నారు. ఆయన గ్రామాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేనప్పటికీ గ్రామాభివృద్ధికి వైద్యశాల నిర్మించుకోవడం అనేది ఆయన చిరకాలవాంఛ అని అన్నారు. దీంతో గ్రామంలో రూ.20 లక్షల 80 వేలతో ఆసుపత్రిని నిర్మించామన్నారు. రూ.40 లక్షలతో సచివాలయం నిర్మించి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. గ్రామస్తుల అభీష్టం మేరకు రూ.ఐదు లక్షల నిధులను అందించి శ్మశానానికి కాంపౌండ్ వాల్ నిర్మించామని, కల్వర్టుల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టామని చెప్పారు. అనంతరం వైద్యశాలను, సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ మాధు శివరామకృష్ణ, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జెడ్పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి ఇమిడి మరియమ్మ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి ఇంటికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించే ప్రభుత్వం వైసిపి అని చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్ అన్నారు. పట్టణంలో బోయగూడెం సచివాలయం-5 మోడల్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయని, ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు వారు ప్రభుత్వం పట్ల సంతృప్తితో ఉన్నట్లుట్లు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.




జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలు

వార్త మెయిన్లో..



నూజివీడులో సిపిఎం కార్యాలయ భవన నిర్మాణ ప్రారంభోత్స సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



హాజరైన సిపిఎం కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బిజెపి అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో 'దేశ రక్షణ భేరి ప్రచారయాత్ర' చెంచుగూడెంలో ప్రారంభమై మండల కేంద్రం బుట్టాయగూడేనికి చేరుకుంది. బస్టాండ్ సమీపంలో యాత్రనుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ కలిసి ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ పరిపాలన సాగించడం దుర్మార్గమన్నార. బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందన్నారు. నేడు సామాన్యులు బతికే పరిస్థితుల్లో లేరని రోజుకోరకంగా నిత్యావసర ధరల పెరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో ధరలు తగ్గిస్తామన్న మోడీ ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఎందుకు ధరలు పెంచారో ప్రజలకు జవాబు చెప్పాన్నారు. రాష్ట్రానికి హోదా ఉండాలని ప్రకటించిన మోడీ హెదా ఇచ్చే విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు. విభజన హామీలను అమలు చేయడం లేదని, గిరిజన యూనివర్సిటీ పునాదిరాయికే పరిమితమవడం దుర్మార్గన్నారు.విభజన చట్టంలోని నిధులను రాష్ట్రానికి తీసుకురావడంలో వైసిపి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బోయ వాల్మీకులను గిరిజన తెగల్లో కలుపుతూ వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం అనైతిక చర్య అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో స్థానిక ఎంఎల్ఎ విఫలమయ్యారన్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ ఐటిడిఎకు ఇంతవరకూ పిఒ, ఇతర అధికారులను నియమించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈనెల 22న బుట్టాయగూడెంలో వేలాది మందితో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాతాలో సిపిఎం జీలుగుమిల్లి మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యురాలు తామ ముత్యాలమ్మ, మండల నాయకులు పోలోజు నాగేశ్వరావు, కె.భాస్కర్ పాల్గొన్నారు.

సిపిఎం, సిపిఐ ప్రచార భేరి విజయవంతానికి పిలుపు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంతో కలిపి ఐదు మండలాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ప్రచార భేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రచారభేరి గోడపత్రికను ఆవిష్కరించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యల పట్ల ప్రజానీకాన్ని చైతన్యపర్చేందుకు ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్టా భాస్కర్రావు, వై.సాల్మన్రాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంఎల్సి సాబ్జీ, నాయకులు

30న ప్రతిభా పాటవ ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి వేసవి ఉత్సవంలో భాగంలో ఈనెల 30వ తేదీన ఎవిఆర్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యాన 28 అంశాల్లో ప్రతిభా పాటవ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం సాహిత్య మండలిలో హేలాపురి వేసవి ఉత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా ఎంఎల్సి షేక్ సాబ్జీ, రిజిస్ట్రేషన్ ఆడిట్ రిజిస్ట్రార్ డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి పి.రామకృష్ణ, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, వై.ఆనందనాయుడు, నృత్యాంజలి కళానికేతన్ నిర్వాహకులు గండికోట రాజేష్ పాల్గొన్నారు. అనంతరం పవర్పేటలోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాబ్జీ మాట్లాడారు. 30వ తేదీన ఎల్కెజి, యుకెజి విద్యార్థులు ఒక కేటగిరిగా, ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు ఒక కేటగిరిగా, కాలేజీ విద్యార్థులు మరో కేటగిరిగా, 26 నుండి 60 ఏళ్ల వయసు వారు ఒక కేటగిరిగా, 60 ఏళ్లు పైబడిన వారు, సీనియర్ సిటిజన్లు మరో కేటగిరిగా విభజించి 28 అంశాల్లో ప్రతిభాపాటవా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. గవరవరంలోని సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏలూరులోని 30 సంఘాల వారు ఈ కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. అపార్ట్మెంట్ల కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హేలాపురి వేసవి ఉత్సవంలో ఒక రిక్రియేషన్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు, దాతలు ఈ కార్యక్రమ నిర్వహణకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం హేలాపురి వేసవి ఉత్సవంలో పాల్గొనదలచిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వేసవి ఉత్సవం ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షులుగా షేక్ సాబ్జీ, అధ్యక్షులుగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కస్తూరిరావు, ప్రధాన కార్యదర్శిగా మానవత ఏలూరు మండల ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, కోశాధికారిగా రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయురాలు ఎబి.త్రిపురసుందరి, అకాడమిక్ అంశాల నిర్వాహకులుగా షేక్ ముస్తఫా ఆలీ, కల్చరల్ అంశాల నిర్వాహకులుగా డి.హేమసుందర్ వ్యవహరిస్తారని హేలాపురి బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ప్రకటించారు. వీరితోపాటు విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవ కమిటీ ఈ కార్యక్రమానికి భాగస్వాములవుతున్న సంఘాల ప్రతినిధులందరూ ఆహ్వాన కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. 200 మంది న్యాయనిర్ణేతలు, ఆర్గనైజర్లు, వాలంటీర్లు భాగస్వాములు కానున్నారని తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 18 కమిటీలు ఏర్పాటు చేసి పని విభజనతో ఉత్సాహభరితంగా కార్యక్రమం చేపట్టామని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు విజిఎంవిఆర్ కృష్ణారావు వివరించారు.

రబీ ధాన్యం కొనుగోలులో నూతన విధానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రబీ ధాన్యం సేకరణకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేయనుంది. ఇప్పటి వరకూ రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా ధాన్యం సేకరించారు. సొసైటీలపై ఒత్తిడిని తగ్గించేందుకు ఈసారి జిల్లాలో వివిధ సొసైటీలు, ప్రభుత్వరంగ సంస్థల ద్వారా సేకరణకు తెరతీశారు. ఉంగుటూరు మండలంలో 25 రైతు భరోసా కేంద్రాలున్నాయి. గతంలో ఇదే మండలంలో నారాయణపురం సొసైటీ పరిధిలో 18 ఆర్బికెలు, బాదంపూడి, బొమ్మిడిలో ఏడు ఆర్బికెల ద్వారా కొనుగోలు చేశారు. అయితే దిగుబడులు ఎక్కువగా రావడంతో పర్యవేక్షణ కోసం, ఇతర సమస్యల పరిష్కారానికి, ఒత్తిడిని తగ్గించేందుకు సపోర్టింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ క్రమంలో ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు, నారాయణపురం, తల్లాపురం, కైకరంలో ఏడు ఆర్బికెలను నారాయణపురం పిఎసిఎస్ (సొసైటీ) సపోర్టింగ్ ఏజన్సీగా వ్యవహరించనుంది. అలాగే ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం నాలుగు ఆర్బికెలను ఏలూరు డిసిఎంఎస్, వెల్లమిల్లి, బాదంపూడిలో మూడు ఆర్బికెలు బాదంపూడి సొసైటీ, బొమ్మిడి, ఉప్పాకపాడు ఆర్బికెలు బొమ్మిడి సొసైటీకి కేటాయించారు. ఎ.గోకవరం, గొల్లగూడెం, గోపాలపురం, యర్రమిల్లిపాడు, గోపీనాథపట్నం ఆర్బికెలను పెరుగ్గూడెం డిసిఎంఎస్కు, కాగుపాడు, కాకర్లమూడి, రావులపర్రు ఆర్బికెలను భీమడోలు ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ కంపెనీ ఏజన్సీలుగా వ్యవహరిస్తాయి.

ఆయా ఏజన్సీలు సంచులు సరఫరా, తేమ శాతం యంత్రాలు, కంప్యూటర్లు, కాటా, స్టేషనరీ తదితర అంశాలపై సమన్వయం చేసుకుని రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం సేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఉంగుటూరు మండంలో సుమారు 25 వేల ఎకరాల్లో ధాన్యం పండించారు. సుమారు 22 లక్షల గోనె సంచులు కావాల్సి ఉంటుంది. గడచిన సార్వాలో నారాయణపురం సొసైటీ ద్వారానే 800 లారీలకు పైగా ధాన్యం తోలారు.




ఖరీఫ్లో ధాన్యం కొనుగోలు (ఫైల్ ఫొటో)

మరమ్మతులకు గురైన తేమ శాతం పరికరాలు

ఈ మండలంలో ఆర్బికెల్లో తేమ శాతం కొలిచే పరికరాలు గొల్లగూడెం, నాచుగుంట, ఉంగుటూరు-1, వెల్లమిల్లిలో మరమ్మ తులకు గురయ్యాయి. వాటిస్థానంలో జిల్లాలో వేరే ఆర్బికెల నుంచి మాయిశ్చర్ పరికరాలను తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సంచుల సమస్యను అధిగమించేనా..!

ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గోనె సంచులను ఇప్పటికే ఆయా ఆర్బికెలకు అందుబాటులో ఉంచాలి. కాని ఆదివారం నాటికి కూడా ఒక్క సంచి రాలేదు. ఈక్రమంలో ధాన్యం సేకరణ సకాలంలో ప్రారంభిస్తారో...లేదో అనే ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఈసారి సంచులు ఎక్కువగా అవసరం ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

శనివారపుపేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు

ఇంటర్నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్, పూనే, మహారాష్ట్ర వారు నిర్వహించిన హ్యాండ్ రైటింగ్‌లో శనివారపుపేట జెడిపిహెచ్.స్కూలు పదో తరగతి విద్యార్థిని పి.జహ్నవికి బెస్ట్ హ్యాండ్ రైటింగ్ ఒలింపియాడ్ అవార్డు బంగారు పతకం లభించింది. ఈ పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతులు, గిఫ్ట్‌కిట్లు సాధించారు. ఆరో తరగతి విద్యార్థులు ఎ.ప్రత్యూష, కె.చరిష్మ, కె.తేజస్విని, ఏడో తరగతి విద్యార్థి ఎ.నాగరాజు, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎ.దుర్గాప్రసాద్, కె.హేమాంజలి, బి.అనిత, బి.సైమన్‌వెస్లీ, కె.శామ్యూల్, ఎండి.రెహాన్, పదో తరగతి విద్యార్థి ఎం.సుష్మ ప్రథమ బహుమతులు, గిఫ్ట్‌కిట్లు సాధించారు. ఈ విద్యార్థులకు చక్కని తర్ఫీదు ఇచ్చిన ఎండి.ఇర్షాదుల్‌అహ్మద్, (డ్రాయింగ్ టీచర్)ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సర్వేశ్వరరావు, ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ రాజేశ్వరి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

వంటగ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు అగ్నిమాపక కేంద్ర అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో మూడో రోజుకు చేరాయి. దీనిలో భాగంగా అపార్ట్‌మెంట్‌వాసులకు, ఎత్తైన భవనాల్లో నివాసం ఉండేవారికి అగ్ని ప్రమాదాల నివారణ ముందస్తు చర్యలు, అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులు ఎదుర్కొనే తీరును అగ్నిమాపక కేంద్ర అధికారి తెలిపారు. ఈ వంట గ్యాస్ వినియోగం సమయంలో ప్రమాదాలు జరిగే తీరు, వాటి నివారణపై డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు, డాక్టర్ విజయ్‌కుమార్

బుట్టాయగూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం జూనియర్ కాలేజీ ఆవరణలో రాజమండ్రి సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, సాయి హాస్పిటల్ ఎండి డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వీటితో పాటు జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని కూడా వైద్య నిపుణులు పరీక్షించారు. ఆపరేషన్ అవసరమైన రోగులకు రాజమండ్రి సాయి హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేసేందుకు రిఫర్ చేశారు. గిరిజన ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంతటి సదవకాశం అందించిన వైద్యులను ఎంఎల్‌ఎ బాలరాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీహరి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, సాయి హాస్పిటల్ వైద్యులు, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపిపి వరలక్ష్మి, మోహన్‌రావు, రత్నాజీ, ఆరేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

'బిసి జనగణన చేపట్టేలా తీర్మానించడం హర్షణీయం'

ప్రజాశక్తి - మండవల్లి

బిసి జనగణన చేపట్టే విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానించడం హర్షణీయమని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగినేని వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే 132వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వమే జనగణన చేపడుతుందని సిఎం జగన్ ప్రకటించడంతో బిసిల్లోని అన్ని సామాజిక తరగతులు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. బిసి జనగణన జరిగితే కులాల జనాభా తమాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఇతర సదుపాయాలు కలిగే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంఘాల తరపున సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన వివరించారు. త్వరితగతిన బిసి జనగణన ప్రారంభించి పూర్తి చేసి బిసిలను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఆదివారం ప్రారంభించారు. వేసవి కాలం కావడం ఎండలు పెరుగుతుండడంతో నగరంలో నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రధాన కుడలిగా ఉన్న స్థానిక జిల్లా కోర్టు సెంటర్లో ఉన్న డ్రైవర్ల అసోసియేషన్ బిల్డింగ్ వద్ద డ్రైవర్లు చలివేంద్రం ఏర్పాటు చేయడాన్ని పెదబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు డిఎస్.కొండయ్య, సాల్మన్ రాజు, వైజిఎల్.నారాయణ, ఆవుల రామారావు, దత్తి వేణు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

పొగాకు బ్యారన్‌లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి రెండు బ్యారన్‌లు దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారజామున మండలంలోని స్వర్ణవారిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుంటుముక్కల రాజా, సతీష్ ఇద్దరికీ చెందిన పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ జరిగే సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకొని మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికి రెండు బ్యారన్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితులు బోరున విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో లోపల పొగాకుతో సహా బాదులు మొత్తం కాలిపోయాయని బాధితులు వాపోతున్నారు. సుమారు రూ.ఎనిమిది లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలుపుతున్నారు. పొగాకు బోర్డు అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - టి.నరసాపురం


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

నాటు సారా తయారీకి ఉపయోగించే 150 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎపిగుంట గ్రామంలో పెద్దచెరువు గట్టు సమీపంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో సారా తయారీ కేంద్రంపై ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 150 లీటర్లు బెల్లపు ఊటతో పాటు సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు.


వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎల్ఎస్.భాస్కరరావు, షేక్‌పర్వీన

ఘనంగా వీరేశలింగం జయంతి

ప్రజాశక్తి - మండవల్లి

బాల్య వివాహాల రద్దు కోసం వితంతువులకు వివాహాలను జరిపించడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. వీరేశలింగం పంతులు 176వ జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి షేక్‌పర్వీన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల రద్దు కోసం ఉద్యమించిన మహోన్నతుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి టంగుటూరి వీరేశలింగం పంతులు అని అన్నారు. దేశంలో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించింది ఆయనే అని అన్నారు. నేటికీ బాల్యవివాహాలు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ దారుణాలను, దురాచారాలను సమాజం నుంచి సమూలంగా పెకిలించినప్పుడే వీరేశలింగం ఆకాంక్షలు నెరవేరతాయని ఆయన తెలిపారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, కె.నాగబాబు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పలు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని సింగరాయపాలెం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు ప్రారంభించారు. మండలంలోని కొత్తపల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన దాసాంజనేయ స్వామివారి చలివేంద్రాన్ని కృష్ణా జిల్లా జనసేన పార్టీ నాయకులు బివి.రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వీరంకి వెంకయ్య, నాయకులు నానాజీ, తోట లక్ష్మి, ఎం.ఆంజనేయులు, దాకారపు చిన్నయ్య, మరియదాస్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పెద్దలు బొమ్మగాని బాలకృష్ణ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో గ్రామానికి చెందిన నల్లమెల్లి పండు జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బొమ్మగాని బాలకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోచలివేంద్రం నిర్వహణ కమిటీ కన్వీనర్ విజయ్ వెంకటేశ్వరరావు, ప్రకాష్, కర్రె జక్కయ్య పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - నిడమర్రు

పెదనింద్రకొలను హైస్కూలులో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి కాలువలో పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు కోరారు. సిఐటియు నాయకులతో పెదనింద్రకొలనులో సంఘటన జరిగిన ప్రాంతంలో ఆయన ఆదివారం పర్యటించారు. అంబేద్కర్ బొమ్మ నిర్వహణ కమిటీతో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహం తొలగించిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు. సిఐటియు నాయకులు వాసు, కాళ్లబత్తుల సురేష్, సక్కెళ్ల సత్యనారాయణ, మార్తారాజు పాల్గొన్నారు.

రాత్రిసభల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల్లోని ప్రతి సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కించే విధంగా గ్రామాల్లో రాత్రిసభ నిర్వహించడం మంచి పరిణామమని ముసునూరు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన తెలిపారు. మండలంలోని లోపూడి గ్రామ సచివాలయంలో తహాశీల్దార్ దాసరి సుధ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ సమక్షంలో రాత్రిసభ నిర్వహించారు. లోపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న అటవీ పోరంబోకు ఎన్నో సంవత్స రాల నుంచి తాతల కాలం నుంచి సాగు చేసుకుం టున్నామని, హక్కు పట్టాలు ఇచ్చారని, అడంగల్‌లో, 1బిలో కూడా తమ పేర్లు ఉన్నాయని కొందరు రైతులు తెలిపారు. ఫారెస్టు శాఖాధికారులు మాత్రం ఇది ఫారెస్టు భూమి అని చెబుతున్నారని ఆందోళన చెందుతున్న రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, సర్పంచి పేరం కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు బి.నంిసింహరావు, వార్డు సభ్యులు, వాలంటీర్లు, గ్రామ సచివా లయ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం, చేగొండపల్లి పంచాయతీల్లో డ్రెయిన్ల పూడిక తీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులను సర్పంచులు పొడుం పుష్ప, జారం సీతామహాలక్ష్మి ఆదివారం చేయించారు. చేగొండపల్లి పునరావాస గ్రామంలో తాగునీటి పంపిణీ మోటార్ మరమ్మతులకు గురికావడంతో రిపేరు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. చేగొండపల్లి పంచాయతీలు డ్రెయినేజీల పూడిక, పొదల తొలగింపు పనులు చేశారు. పోలవరం పంచాయతీ కొత్తపేటలో సీసీ రోడ్లపైకి వచ్చిన పొదలను పంచాయతీ సిబ్బంది బంగారు కృష్ణ, ఇతర కార్మికులు తొలగించి, ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చేశారు.

క్షతగాత్రునికి పర్వతనేని సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

ఈనెల 14వ తేదీన నూజివీడులో జరిగిన చంద్రబాబు రోడ్‌షోలో పాల్గొనేందుకు వెళ్లిన సందర్భంలో ద్విచక్రవాహనం ఢీకొని కాలు విరిగిన కొత్తగూడెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గొడవర్తి పోతురాజుకు పార్టీ సీనియర్‌నేత పర్వతనేని గంగాధర్‌రావు ఆర్థికసాయం చేశారు. విజయవాడలోని మెట్రో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు.

ఫార్మసీ విద్యార్థికి 'రోటరీ' సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. ఆదివారం రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ ద్వారా దాత కాకర్ల రామచంద్రబాబు వితరణతో రూ.25 వేలు విద్యాప్రోత్సాహం అందించారు. కృష్ణ సారథ్యంలో 2021-22 సేవా సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బాలికా విద్యాప్రోత్సాహంలో భాగంగా రాజమండ్రి గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అభ్యసిస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన రొంగల సుచిత్రకు వరుసగా రెండోసారి కాలేజ్ ఫీజు నిమిత్తం రూ.25 వేలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు, బండారు సత్యనారాయణ, కొమ్ముకూరి నాగేశ్వరరావు, రొంగల దేవీప్రసాద్, బవిరిశెట్టి హనుమాన్ తిలక్, మారిశెట్టి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

దొరసానిపాడు న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ రకాల డ్యాన్సులు, పాటలతో, వేషాలతో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ నల్లూరి సంజీవ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్కంఠగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఇరుజట్ల క్రీడాకారులు

ఉంగుటూరులో శ్రీలక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు మూడో రోజు ఆదివారం ఉత్కంఠంగా జరిగాయి. మొదటి ఆటలో నిడమర్రు, బైనేపల్లి మధ్య జరిగిన పోటీల్లో బైనేపల్లిపై నిడమర్రు 50 పరుగుల ఆధిక్యతతో గెలిచింది. గోపీ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు. రెండో మ్యాచ్ భీమడోలు, సూరప్పగూడెం మధ్య జరగగా 61 పరుగుల తేడాతో సూరప్పగూడెం విజయం సాధించింది. మూడో ఆటలో కైకరం, పూళ్ల మధ్య జరగగా కైకరం 68 పరుగుల తేడాతో గెలిచింది. నాలుగో మ్యాచ్‌లో జల్లికాకినాడ, వెల్లమిల్లి మధ్య జరగగా జల్లి కాకినాడ 61 పరుగులు చేసింది. వెల్లమిల్లి ఏడు ఓవర్లో 62 పరుగులు చేసి విజయం సాధించింది. ఫౌండేషన్ ఛైర్మన్ పత్సమట్ల ధర్మరాజు, కృష్ణంరాజు, బాసిరాజు, సత్యనారాయణ జ్ఞాపికలు అందించారు.

బాబురావుకు జ్యోతిరావుపూలే ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బాబురావు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు సిల్క్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు మహాత్మ జ్యోతిరావు పూలే ఎక్స్‌లెన్స్ అవార్డు-2023ను అందుకున్నారు. ఎపి ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ చేతులమీదుగా తిరుపతిలో పూలే టీచర్స్ ఫెడరేషన్ వారు అందించారు. మహాత్మ జ్యోతిరావుపూలే 196వ జయంతిని తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి ప్రతిభ గల ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఏలూరు జిల్లా నుంచి బాబురావు మాస్టారును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బాబురావు మాస్టారు పాఠశాలలో విద్యార్థులకు నూతన మెలకువలతో విద్యను బోధిస్తున్నందుకు, సామాజిక అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నందుకు, ఈ అవార్డును అందిస్తున్నట్లు నిర్వాహకులు, పూలే టీచర్స్ అసోసియేషన్ వారు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, శ్రేయాభిలాషులు బాబురావుకు అభినందనలు తెలిపారు.

దొరసానిపాడులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని దొరసానిపాడులో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వెంకట్రావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా చెప్పగలుగుతున్నామంటే అందుకు కారణం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనేనన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్కాబత్తుల సిద్దిరాజు, ఎంపిటిసి సభ్యులు అల్లాడ హరే రామకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్, వాసు, బొండాడ వెంకన్నబాబు, మంచెమ్ మోహన్ పాల్గొన్నారు.